


# సర్వశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

*ఇప్పటివరకూ జరిగిన కథ*

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్వశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

**హుంజాలోయ** నిశ్శబ్దంగా ఉంది. ఎవరినోటా మాటలు ప్రవహించడం లేదు. ఊరు ఊరంతా ఒకే చోట గుమికూడింది. అది 'ఇసాక్ అల్ ముంజా మీర్' ఇంటి ముందు

"మొన్న మీర్ భాయ్ చెపితే. నమ్మలేదు" విచారంగా అన్నాడు బద్రుద్దీన్ ఖురేషీ. తల పంకించాడు మొహమ్మద్ నయామీ సురుభ్, హుస్నామీర్, మీర్ సాబ్‌ల పార్థివ శరీరాలు బ్రతికి ఉన్నప్పటిలానే తేజోవంతంగా ఉన్నాయి.

"ఇద్దరం ఒకేసారి మృత్యువు పాలవుతాం ఖురేషీ. మాది మృత్యువు కాదు. శరీరాల్లోంచి విడుదల. నిన్నరాత్రి 'ఆ' మనిషి కల్లో కొచ్చి చెప్పాడు. పుట్టాల్సినవాడు పుట్టాడనీ మా రుణం తీరిపోయిందనీ" మొన్న మీర్ చెప్పిన మాటలు స్పష్టంగా ఖురేషికి గుర్తున్నాయి.

"ఇంకేం చెప్పాడు?" ఖురేషి తన గొంతులో వెటకారం కనపడకుండా జాగ్రత్తపడి అడిగాడు.

హుంజావేలీ మాత్రమే సురక్షితంగా ఉంటుంది. మిగతావి దద్దరిల్లిపోతాయి. కొండలు పిండిగా మారతాయి. పర్వతాలు పగుళ్ళువారతాయి. వేలాది జనం క్షణాల్లో మాడి మసి అవుతారు. రోడ్లూ, విమానాశ్రయాలూ

ముక్కలవౌతాయి. నీరు విషమయమైపోతుంది. హుంజా వేలీ మాత్రం మిగిలున్న వాళ్ళ ఆకలి దప్పులు తీరుస్తుంది. అయితే..." ఆగాడు హుంజామీర్.

"అయితే?"

"రాజకీయపు నీడలు పడకుండా చూసుకోవలసిన బాధ్యత మనదే. అది మహా విషనాగుల పడగ నీడలాంటిది. మతం పేరుతో, శాఖల పేరుతో మనని విడగొట్టే మనుషులొస్తారు. లొంగకండి. లొంగితే మిగిలేది సర్వనాశనమే" మళ్ళీ ఓసారి ఆగాడు హుంజా మీర్. సామాన్యంగా ప్రశాంతత నిండి వుండే అతని ముఖం ఉద్వేగంతో ఎర్రబడిపోయింది. శరీరం ఆవేశంతో చివురాకులా ఊగుతోంది. అంత చల్లని వేళలో కూడా మీర్ ముఖం మీద చిరు చెమటలు. "చాయ్" మెల్లగా వారికి మాత్రమే ప్రత్యక్షమైన చోట వారిద్దరి ముందూ పెట్టింది హుస్నా మీర్.

"బద్రుద్దీన్ ఖురేషి... నువ్వు నన్ను వింటున్నావు. కేవలం గౌరవంతో. నీకు నా మాటల మీద సంపూర్ణ విశ్వాసం లేదు. 'బిర్యాయి'లో భీముడి  కథ జ్ఞాపకం ఉందా? ఒక మహా భారత యుద్ధం.. భూమి గతినే మార్చేసింది. ఎన్ని అస్త్రాలు సంధింపబడ్డాయి? ఎన్ని లక్షల మంది ఆత్మలు గాలిలో కలిసిపోతాయి. 'సంతృప్త ద్రావణం' అంటే తెలుసా? ఓ గ్లాసులో నీళ్ళు పోసి ఒక్కో చెంచా పంచదార పోసి కలుపు. ఒక స్టేజికి వచ్చాక పంచదార కరగదు. అంటే గ్లాసులోని నీటికి ఇక ఏమాత్రం పంచదారని కరిగించే శక్తిలేదన్న మాట. అలాగే ఎన్ని ఆత్మలని ఒకేసారి పంచభూతాలు జీర్ణించుకోగలుగుతాయి? ఆ మిగిలినవే ఓ ప్రళయం సృష్టించబోతున్నాయి. అవి అనంతంలో జీర్ణ మహర్దశలాంటి ప్రళయం తప్పదు. మరి ప్రళయాన్ని సృష్టించేది ఎవరూ?" మళ్ళీ ఆగాడు హుంజా మీర్. బద్రుద్దీన్‌కి భయం వేసింది. మాట్లాడుతున్నది సాధు స్వభావుడైన మీర్‌లా కనిపించలా. ఏదో ఆత్మ అతన్ని ఆవహించి, అతని ద్వారా మాట్లాడుతున్నట్లు అనిపించింది. బద్రుద్దీన్ ఒక షాక్‌లో ఉన్నాడు.

"రామ రావణ యుద్ధంలో మరణించిన రాక్షసుల ఆత్మలు ఏమయ్యాయి. సరే.. హిందువుల పద్ధతి ప్రకారం పరమాత్మలో కలిసిపోయాయి. ఆ తరవాత?

జన్మించిన ప్రతి జీవీ మరణించక తప్పదు. అలాగే మరణించిన వారూ మళ్ళీ జనియించక తప్పదు' అని వారే అంటారుగా. ఓ క్రూరాత్మ మరణించిన తరవాత క్రూరాత్మగా జన్మిస్తుందా?  లేక పవిత్రాత్మగానా? ఈ చావు పుట్టుకల పునాది 'ఋణం' అంటారు.

'ఋణానుబంధ రూపేణా' అని కదా అనేది. ఏ రుణం? గత జన్మ రుణం. గత జన్మ రుణం ఏవిధంగా తీర్చాలి? క్రూరాత్మ పవిత్రాత్మగా పుట్టా? పవిత్రాత్మ క్రూరాత్మగా జన్మించా?" బద్రుద్దీన్‌తో పాటూ హుస్నా మీర్ కూడా షాక్ తిన్నది. భర్తనోట తనకే తెలియని భాషా?

"హుస్నా.. ఆశ్చర్యం అక్కరలేదు. ఒకప్పుడు అందరం కలిసేవుండేవాళ్ళం అప్పుడు 'స్తాన్'లు లేవు. అఖండ దేశం ఒకటే ఉండేది. ఒకరి భాష ఒకరిదే, ఒకరి భావం మరొకరికి ఇంపుగా ఉండేది. 'మతం'మానవుల నడవడికను మలిచేది. విద్వేషాలప్పుడు లేవు. నా చిన్నతనంలో కొంతకాలం ఢిల్లీ బొంబాయిలలో మాత్రమేగాక ఇప్పటి సౌత్ ఇండియాలో కూడా తిగాను. కానీ అక్కడి భాషలు మాత్రం పట్టుబడలేదు. సరే, ఆ సంగతి అలా ఉంచితే – బద్రూ.. జాగ్రత్తగా విను. రామాయణ కాలం నించి మహా భారత కాలం వరకు ఆ ఆత్మలు మళ్ళి పుడుతూ మళ్ళీ చూస్తూ పయనిస్తూనే ఉన్నాయి. ఇది కలికాలం. మహాభారత కాలం నాటి ఆత్మలో మరింత తీవ్రంగా ఉగ్రంగా తమలోని క్రౌర్యాన్ని బయట పెట్టుకుంటాయి. ధనవంతుడు మరింత ధనవంతుడిగా, పేదవాడు మరింత పేదవాడిగా ఎలా మారుతున్నాడో, ధర్మపరులు మరింత అధర్మంగా ప్రవర్తిస్తారు. అధర్మపరులు మరింత క్లిష్టమైన పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒక్కటి మాత్రం నిజం రాబోయేకాలం ఊహాతీతం" చెప్పాల్సింది చెప్పేసి లోపలికి వెళ్ళిపోయాడు హుంజామీర్.

"భయ్యా.. నిన్నటినించీ చాలా చిత్రంగా ఉన్నారు. చిత్రంగా మాట్లాడుతున్నారు. కానీ, ఒకటి నిజం పుట్టవలసినవాడు పుట్టడం నిజం. మేము విముక్తులం కావడమూ నిజమే" అంటూ హుస్నా కూడా లోపలికి వెళ్ళిపోయింది.

ఆ తరవాత హుస్నానీ, మీర్‌నీ చూడటం బద్రుద్దీన్‌కి ఇదే మొదటిసారి. అప్పుడు వారిని సజీవులుగా చూస్తే ఇప్పుడు నిర్జీవులుగా చూస్తున్నాడు. తేడా అంతే. ఇద్దరూ ఒకేసారి పోవడం ఏమిటో? హుంజా వేపే ఈ వార్తతో అట్టుడికిపోయింది. నోట్లో నువ్వు గింజనైనా దాచలేని బద్రూ యీసారి మీర్ సాబ్ అన్న మాటల్లో ఏ ఒక్కటీ బయట పెట్టలేదు. అతని నోరు పెకలడంలేదు.

అందరూ హుస్నా, మీర్‌ల పార్థివ శరీరాల్ని చూసి తమ అంతిమ గౌరవాన్ని తెలియజేస్తున్నారు. ఏడ్పులూ, పెడబొబ్బలూ లేకపోవడంవల్ల అక్కడ ఓ మౌన ప్రశాంతత నిండుగా అలుముకుంది.

పెద్దలు వచ్చి వారి కూతురు ఫాతిమాకీ ఆమె భర్త పిల్లలకీ కర్తవ్యబోధ చేశారు. తరువాతి కార్యక్రమాలు ఎలా సజావుగా చెయ్యాలో

పదిహేను రోజుల క్రితం

పురానా దిల్లీ...చాందినీ చౌక్‌నించి పురానా దిల్లీ స్టేషన్‌కి వెళ్ళే దారిలో 'పరంతావాలా గల్లీలో' దాటి ఎడమవైపుకి తిరిగి నాలుగైదు సందు గొందులు దాటాక కనబడుతుంది. 'షౌకత్' అనే పురాతన భవంతి. ఆ భవంతి వయసు ఖచ్చితంగా చెప్పేవారు అక్కడ ఎవరూ లేదు. ఎర్రరాయితో కట్టిన భవంతి అది. లాల్ ఖిల్లా (రెడ్ ఫోర్ట్)కి తెచ్చిన రాయి కొంత మిగిలితే ఆ శిలలతో ఆ భవంతిని నిర్మించారంటారు.

అందులో ఉండేవారు సామాన్యంగా బయటికి రారు. విపరీతమైన 'ఘోషా'ని పాటిస్తారు.

కొత్తగా పుట్టిన పిల్లవాడు బొడ్డు కోసిన వెంటనే, ఏడవలేదనీ, నవ్వాడనీ మంత్రసాని నిర్మల్ త్యాబ్జీ చెప్పింది .ఓల్డ్ ఢిల్లీలోని బెస్ట్ మంత్రసాని ఆవిడ. కనీసం ఏడెనిమిది వందల పురుళ్ళు పోసింది. ఆ ఇలాకాలో పురుళ్ళకి డాక్టర్స్‌ని కంటే, నిర్మల్‌ని నమ్ముతారు. గొప్ప హస్తవాసి.

పేరు గురించి చర్చ మొదలయ్యేలోగానే, బాలింత అన్నది 'హుంజా మీర్' అని.

"అదేంటి?" అన్నారు ఆడవాళ్ళు.

"వీడి పుట్టుకలో ఓ అద్భుతమైన తరం తెరమరుగవుతుందని మా మామగారు చెప్పేవారు. ఆ తప్ప అత్యంత సున్నిత మనస్కుడూ, దయార్ద్ర హృదయుడూ, పన్నెండూ పదమూడు దశాబ్దాలు జీవించిన ఆల్ హుంజా మీర్ పేరు పెడదామని ఎప్పుడో నిర్ణయించుకున్నా" అన్నాడు నవ మాత.

"ఆడపిల్ల పుడితే?" అడిగింది నిర్మల్.

"హుస్నా" అన్నది కొత్త తల్లి నవ్వుతూ.

"మీ పేరు?" అడిగింది నిర్మల్.

"నా పేరు మీరా. నా మూలం మార్చుకున్నాక 'ఖబీజా' అని పేరు పెట్టారు.

"ఇష్టంగానే ముస్లిం అయ్యారా?" అడిగింది నిర్మల్.

"మా అత్తగారంటివైపు వారు, అంటే ఈ ఇంటివారు ఏనాడూ హిందూ ముస్లిం తేడా చూపలేదు. 'అందరినీ ప్రేమించు' అనే నినాదం వారిది. ఇప్పటికి కూడా నన్ను నాన్ వెజ్ తినమనో వండమనో ఎవరూ అడగలా. నా దేవుడ్ని నేను పూజిస్తూంటే ఎవరూ ఆపలా. అందుకే ఇష్టంతోనే మతం మారాను. పుట్టబోయే పిల్లలకి ఇబ్బంది రాకూడదని" నవ్వుతూ వివరించింది మీరా ఉర్ఫ్ ఖబీజా.

పిల్లవాడు చెవులు రిక్కించి వినడాన్ని గమనించింది నిర్మల్.

"నేనో పేరు పెట్టనా?" అప్రయత్నంగా అన్నది.

నిర్మల్ "సరదాకైతే పెట్టండి" అన్నది మీరా నవ్వి.

"షగున్.. షగున్ హుంజా మీర్" అన్నది నిర్మల్. అసలా పేరు ఆవిడ పెదాల మీదకి ఎలా వచ్చిందో ఆమెకే తెలీదు.

"షగున్ అంటే మౌనం' కదూ!" అన్నది మీరా.

"షగున్, షమీన్, షాబాద్, షకుని ఏదైనా పెట్టొచ్చు" అన్నది నిర్మల్.

"మైగాడ్.. మిగతావి సరే షకుని అంటే 'శమేని' అని జనాలు ఒణికిపోతారు" కంగారుగా అంది మీరా.

"అయితే షగునే బెటర్" అన్నది నిర్మల్.

"అన్నీ మీరే నిర్ణయిస్తారా మా బిడ్డకి కూడా ఏదైనా అవకాశం ఇస్తారా?" అన్నది మీరా అత్తగారు. అన్నీ వింటూ.

"బిడ్డ నవ్వు చూసిన సంతోషంతో నా పరిధిని దాటి మాట్లాడాను. క్షమించాలి" చేతులు జోడించి సర్దుకుంది.

నిర్మల్ "నీ హస్తవాసి మంచిది నిర్మల్.. ఇదిగో" మెడలోంచి రెండు పేటల బంగారు గొలుసు తీసి నిర్మల్‌కి ఇచ్చింది పెద్దావిడ.

"ఇది కేవలం  నామమాత్రం. మావాడొచ్చాక చెవి నులిమి మరీ నీ ఫీజూ, బహుమానం తీసుకో" అంది కూడా.

కళ్ళెత్తి మీరాని చూసి పెద్దావిడకి సలాం చెప్పి బయటికి నడిచింది నిర్మల్. అక్కడ బంగళావారి సొంతమైన గుర్రపు బండి ఉంది. అది మామూలిదికాదు.

**జనానా** బయటికిపోయేప్పుడు ఉపయోగించే 'సార్ట్ 'లాంటిది.

"షగున్... షగున్.. శకుని" బండిలో కూర్చుంటూ తనలో తాను అనుకుంది నిర్మల్. ఒక్కసారి గుర్రం గట్టిగా సకిలించింది. "ఇదేమి శకునం?" అనుకుంది నిర్మల్.

పొద్దువాలిపోయింది. మట్టూ లేచాడు. ఓ పక్క అలసట.. ఇంకోపక్క ఆకలి. అయినా మనసులో గురువాక్యం. మనసుని జయించాలి, ఆకలినీ జయించాలి. గబగబా శక్తిని తెచ్చుకుని నడుస్తున్నాడు. ఓ చోట పడిపోయిన కొబ్బరి చెట్లు. కత్తితో కొబ్బరి బోండాలను చెక్కి కడుపునిండా కొబ్బరి నీళ్ళని తాగాడు.

'పడిపోయిన చెట్టు' ఎవరిదో వారికి ధన్యవాదాలు మనసులోనే తెలుపుకుని ముందుకు సాగాడు.

'తక్షపురం' దూరంగా కనిపిస్తోంది. వెలుగు కొంచెం ఉండగానే చేరాడు ఆ ఊరికి. ఒకతను మట్టూని గమనించి ఆశ్చర్యంతో

"చెరువుదాటి వచ్చావా? ఓర్నీ అసాధ్యం కూలా..!" అన్నాడు రెండు చేతులూ పైకెత్తి.

"తప్పలేదు బాబూ.. నా బిడ్డ చావు బతుకులో ఉంది. ఈ ఊళ్ళో ఉండే 'పాములగుడి'కి మొక్కితే బతుకుతాడని మా సాములోరు చెప్పారు. అందుకే వచ్చ" విచారంగా మొహం పెట్టి అన్నాడు మట్టూ. అంతేకాదు, "గుడి చూపించి పుణ్యం కట్టుకోవా అన్నా" అనీ అన్నాడు.

"అది పేరుకి గుడే కానీ గుడి కాదు. అక్కడ దీపాలూ, నైవేద్యాలూ ఉండవు. అయినా, ఆ గుడి గురించే నానా గొడవలు జరుగుతున్నాయి. అసలీ అకాల వర్షం కూడా ఏదో చెడ్డ శకునాన్నే తెలుపుతోందట" నిట్టూర్చి అన్నాడు ఆ గ్రామికుడు.

"అయ్యా.. గుడి అనేది ఎప్పటికీ గుడే. నైవేద్యాలూ, పూజలు జరిగినా జరక్కపోయినా. ఏదో ఓ శక్తి అక్కడ లేకపోతే మా సాములోరు అక్కడికి వెళ్ళి మొక్కుకోమని అనరుగదా. అయ్యా, గుడి చూపించండి" అన్నాడు మట్టూ వినయంగా.

"సరే. చూపించడానికి కష్టమేమీలేదు. ఈ ఊరుకి ఉంది ఒకటే రోడ్డు. అటూ ఇటూ ఇళ్ళుంటై. ఊరి లోపలికి వెళ్ళనక్కరలేదు. ఊరి మధ్యలోనే కనిపిస్తుంది. ఆ పడగవిప్పిన నాగ దేవుళ్ళని చూసి భయపడమాకు. వెళ్ళిరా" అన్నాడతను

తలపాగా దులిపి భుజాన వేసుకుంటూ. మట్టూ దండం పెట్టి సూటిగా ఊరి మధ్యలోకిపోయాడు. వర్షం ఊరికి చేసిన నష్టం కళ్ళకి కడుతోంది. పై కప్పులు ఎగిరిపోయిన పాకలు, రేకు షెడ్లూ, పెంకులు చెదిరిపోయి లోపలి వెదురు బద్దలు కనిపిస్తున్న పెంకుటిళ్ళు.. పడిపోయిన గోడలు.. కకావికలైన సామాన్లూ, వడ్ల పురులూ అన్నీ ఒక మనో దైన్యానికి రుజువులుగా ఉన్నాయి. ఎవరి మొహంలోనూ కళలేదు. భయం తప్ప. చెట్లు విరిగిపోయినవి విరిగినట్టేఉన్నాయి. ఎవరూ వాటిని తొలగించే పనిలో కూడా లేరు. ఏ ఒక్క దుకాణమూ తీసి లేదు.

"ఎక్కడుండాలీ?" తనలో తను అనుకున్నాడు మట్టూ.

అందరూ ఓ విహ్వలత్వంలో ఉన్నారు. కురిసిన భీకర వర్షానికి వండుకునే వస్తువులు కూడా ఏవీ మిగల్లేదు.

తక్షపురం ఊరి ప్రెసిడెంటు – పూజారీ, మునసబు, పెద్దలందరూ సమావేశమయ్యారు. ఓ పక్క నిలబడి మట్టూ కూడా వారిని వింటున్నాడు. "అందరికీ భోజన ఏర్పాట్లు హనుమంతుడి గుడి దగ్గరే చేద్దాం. ప్రెసిడెంటుగా నేను అయిదు బస్తాల ధాన్యం ఇస్తాను. మీరు మీరు ఏమివ్వగలరో ఇవ్వండి. ఈ పూటకి పులిహోర మాత్రమే వండిద్దాం. షావుకార్లందరూ వంటసామగ్రి అప్పుగా గ్రామానికి ఇవ్వాలి. గ్రామం బాగుపడ్డాక అప్పు తీర్చబడుతుంది. ప్రభుత్వానికి తెలియజేస్తాను. మన గ్రామానికి జరిగిన నష్టం ఎంతో, ఎంత పరిహారమివ్వాలో. అది తరవాత సంగతి. ముందు తాటాకు ఇళ్ళ కప్పు కోసం తాటాకులు పాకలవారు ఉచితంగా కోసుకునే వీలు కల్పిస్తున్నారు. ఇంకా..." అరగంటసేపు ఉపన్యాసం సాగింది.

మట్టూకి తృప్తి ఏమంటే, భోజనానికి ఇబ్బంది లేకపోవడం. ఇహ పడక సంగతా? భిల్లుడు నిద్రించలేని చోటు లోకంలో ఉంటుందా?

"అమ్మా.. నా పేరు ఇసాక్ అల్‌హసన్ హుంజామీర్. మా తాత తాతది. ఇప్పుడే తెలిసింది నాకు బిడ్డపుట్టాడని. మా ముత్తాత గారి మాట ప్రకారం వారి మరణమూ, నా బిడ్డ జననమూ ఒకేసారి కోర్టు ముందూ వెనుకగా జరుగుతాయని. హుంజా వేలీ సంగతి తెలీదు. పురానా దిప్పలో నాకు కుమారుడు కలగడం నిజం. వాడు చల్లగా, క్షేమంగా వీరుడిగా, దయాళువుగా పెరగాలని మీరు ఆశీర్వదించండి " మహా కన్యాదేవికి నమస్కరిస్తూ అన్నాడు హసన్.

"తథాస్తు.." దీవించింది మహా కన్యాదేవి అప్రయత్నంగా.

"ఇక బయలుదేరతానమ్మా" రెండు చేతులూ జోడించి నమస్కరించి బయలుదేరాడు హసన్.

"ఒకరు చనిపోవడం మరొకరు పుట్టడం ఎలా? " అడిగాడు హనుమంతు మాయామయిని.

"ఆ 'లెక్క' నీకు ప్రస్తుతం చెప్పినా అర్థంకాదు హనుమంతూ... మనం అత్యంత ఆప్తులుగా భావించేవారే గత జన్మలో శత్రువు కావచ్చు. ఇప్పుడు మనం మహా శతృవులుగా భావించే వారే రేపు ప్రాణాలు కాపాడే మిత్రులు అవొచ్చు. ఈ లెక్క వేరు. ఇది ఒక్కటి తెలిస్తే, ప్రపంచంలో యుద్ధాలూ, తన్నుకోవడాలూ తిట్టుకోవడాలూ ఎందుకుంటై. ఒకరు

ఆకలితో పస్తులుండటం అప్పుడు జరుగుతుందా? నాయనా, దీన్నే 'విధివైచిత్ర ' అంటారు. మనం కేవలం విధి ఆడే చదరంగంలో పావులం. అంతే" అన్నది మహామాయ. హనుమంతు అసంతృప్తిగా బయటికి పోయాడు.

మహా మాయి ఇంకా ఆలోచిస్తూనే ఉంది, కన్యాదేవి 'తథాస్తు' అని చేతులెత్తి ఆశీర్వదించడం. కన్యాదేవి అలా ఆశీర్వదించడం ఎప్పుడూ చూడలేదు. గాఢంగా నిట్టూర్చింది మహామాయ.

"అమ్మా. ప్రయాణానికి సిద్ధం చేయండి"మహా కన్యాదేవి మహామాయతో అన్నది.

"ఎక్కడికీ?"

"ఇప్పటికి తెలీదు. కానీ తెలుస్తుంది. మీరు సన్నద్ధం చేయండి" ఆలోచిస్తూ అని మహా కాళేశ్వరుని దర్శనానికి చకచకా నడుచుకుంటూ వెళ్ళిపోయింది కన్యాదేవి.

హనుమ వియాక్షిప్రా నది దగ్గరున్నాడు. పొంగిపొరలుతున్న ఆ నదిని చూస్తూ.

"అబ్బ.. ఎంత భీభత్సం సృష్టించింది ఈ నది. ఇప్పుడు నంగనాచిలా ప్రవహిస్తోంది" అన్నాడో సాధువు.

"అవును.. నదీ పయనం, జీవి పయనం ఒకలాంటివే. ఎప్పటికప్పుడు గతులు మార్చుకుంటూనే ఉంటాయి" అన్నాడు రెండో సన్యాసి.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments